


# నేటిధాత్రి

22ND ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక



శుక్రవారం 17-04-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 18 రూ॥ 6.00


22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

నేటిధాత్రి

22ND ANNIVERSARY

# 22వ వసంతపు తోరణం

**చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది “అక్షరం”**

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో “21 మైలు రాళ్లు ” దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ **“22 వ వసంతం”** లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

## “నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో

**మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్పూర్తిగా కోరుకుంటూ....**



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY

వసంతాల అక్షరోద్యమం



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

**Corporate Office Address :**

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యువనేత నారా లోకేష్




- యువ కిశోరం నారా లోకేష్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు
- "ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హర్షధ్వానాలు
- రాబోయే కాలానికి కాబోయే ముఖ్యమంత్రి మన యువ కిశోరం
- నారా లోకేష్ కి శ్రీవారి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి
- చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్.

చిత్తూరు, నేటిధాత్రి:
తెలుగుదేశం పార్టీ నవశకానికి వారధిగా, కోట్లాది మంది కార్యకర్తల ఆశల ఆశాకిరణంగా ఎదిగిన యువనేత నారా లోకేష్ గారు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం హర్షణీయం. వారికి హృదయ పూర్వక ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ వారికి శ్రీవారి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త జిజెఎం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరియు చైర్మెన్ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. తన అసాధారణ పనితీరుతో, చెక్కుచెదరని సంకల్పంతో అటు పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని, ఇటు యువతరాన్ని ఏకతాటిపైకి తెచ్చిన లోకేష్ నియామకం. టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. నాయకత్వం అంటే కేవలం పదవి కాదు, అంకితభావంతో కూడిన బాధ్యత అని నిరూపించిన ఆయన, రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని విజయ తీరాలకు చేర్చడం ఖాయం. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. నారా లోకేష్ తండ్రికి తగ్గ తనయుడిగా పార్టీ బాధ్యతలను, మంత్రిత్వ శాఖను సమాంతరంగా సమర్థవంతంగా నిర్వహిస్తూ యువ కిశోరం అందరికీ స్ఫూర్తిగా నిలిచి ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందిన ఏకైక నాయకుడుగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పార్టీని తన భుజస్కంధాలపై వేసుకొని కార్యకర్తలకు భద్రత బరోసా కల్పించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. యువ కిశోరం నారా లోకేష్ కు పార్టీ పై ఉన్న నమ్మకం, కార్యకర్తలపై ఆయన చూపుతున్న ఆదరాభిమానాలకు గుర్తింపుగా ప్రపంచంలో ఏ పార్టీ కి లేని సభ్యత్వం ఒక్క తెలుగుదేశం పార్టీకి ఉందంటే అది యువ కిశోరం నారా లోకేష్ వినయ విధేయతలకు నిస్వార్థ సేవలకు నిలువెత్తు నిదర్శనం అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు.

**కార్యకర్తలకు నారా లోకేష్ పెద్దపీట**

తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేస్తూ యువనేత మంత్రి నారా లోకేష్ వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. కడప మహానాడు వేదికగా కార్యకర్తే అధినేత అనే నినాదంతో పార్టీనీ పరుగులు పెట్టిస్తున్న యువ కిశోరం నారా లోకేష్. పని చెప్పేవారి కంటే పనిచేసేవారికే గుర్తింపు ఉంటుందని నారా లోకేష్ స్పష్టమైన సంకేతాలిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడే తన సరికొత్త ఆలోచనలను అమలు చేస్తూ క్షేత్ర స్థాయిలో కష్టపడిన సాధారణ కార్యకర్తలకు వేదికపై సముచిత స్థానం కల్పించి అందరిని ఆశ్చర్యపరిచారు. సీనియర్ల అనుభవం, జూనియర్ల దూకుడును సమన్వయం చేస్తూ , రాజకీయ నేపథ్యం లేకపోయినా పార్టీకి విధేయులుగా ఉన్న యువతను గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో పార్టీకి సరికొత్త నాయకత్వాన్ని అందించేలా యువ కిశోరం నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని వారికి వారే సాటి వారికి లేరు ఎవరూ పోటీ అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు.

**రెండవసారి రాష్ట్ర అధ్యక్షుడు గా పల్లా శ్రీనివాసులు**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి రెండవసారి రాష్ట్ర అధ్యక్షుడు గా పల్లా శ్రీనివాసులు నియామకం హర్షించదగ్గ విషయమని ఈ సందర్భంగా టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. ఒక బి సి. పల్లా శ్రీనివాసులు కు రెండవసారి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గా గుర్తించడం అది చంద్రబాబు నాయుడు దూరదృష్టి, బి సి ల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. పల్లా శ్రీనివాసులు కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా, సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూ, యువతను ప్రోత్సహిస్తూ తెలుగుదేశం పార్టీని భవిష్యత్ తరాలకు ఒక తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దగల గొప్ప సేవకుడు అని వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు

టీడీపీలో కార్యకర్తే అధినేత. సామాన్య కార్యకర్తకు కూడా జాతీయ, రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇచ్చే ఏకైక పార్టీ టీడీపీ అని మరోసారి రుజువైంది. జాతీయ, రాష్ట్ర కమిటీల్లో నూతనంగా నియమితులైన నాయకులకు హృదయపూర్వక అభినందనలు. మీరు ఎంపిక కావడం మీ శ్రమ, నిబద్ధత, పార్టీ సిద్ధాంతాలపట్ల ఉన్న అనురాగానికి గుర్తింపు. మీ నాయకత్వం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. తెలుగుదేశం పార్టీ అన్ని స్థాయిల్లో మరింత బలపడుతుందని, ప్రజాసేవలో స్ఫూర్తిని కల్గిస్తుందని ఆశిస్తున్నాను. మీరు చేపట్టబోయే ఈ కొత్త బాధ్యతల్లో విజయం సాధించాలని పార్టీ తరఫున, కార్యకర్తల తరఫున చిత్తూరు నియోజక వర్గం ప్రజల తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త జిజెఎం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరియు చైర్మెన్ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు..

# బోట్లు తయారీ కంపెనీని తరిమేస్తారా

- పెట్టుబడులు వస్తే తట్టుకోరా జగన్ గారూ
- ఇదేం రాక్షస మనస్తత్వమో : లోకేశ్ ఆగ్రహం



అమరావతి, నేటిధాత్రి:
దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం అంటే భక్తి లేదు. దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు అని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వస్తాయంటే ఉసూరుమంటూ ఏడుస్తారని వ్యంగ్యంగా అన్నారు. రప్పా.. రప్పా నరుకుతాం.. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేస్తాం.. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్‌రెడ్డి? అంటూ వైసీపీ అధినేతను మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా సూటిగా నిలదీశారు. దేశ రక్షణకు అధునాతన బోట్ల తయారీ కంపెనీ రాష్ట్రానికి వస్తే.. స్వాగతించాల్సింది పోయి తిరిమేస్తానంటారా? ఇదేం రాక్షస మనస్తత్వం? అంటూ జగన్ వైఖరిని మంత్రి లోకేశ్ ఎండగట్టారు. మత్స్యకారుల పిల్లలకు వెయ్యికిపైగా ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి అడ్డుకుంటామనడం సైకోయిజమే అవుతుందంటూ జగన్ వ్యక్తిత్వాన్ని మంత్రి లోకేశ్ వివరించారు.

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



కర్నూలు, నేటిధాత్రి:
కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.


# మంత్రాలయం ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

## మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం ప్రకటన



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలతోపాటు క్షతగాత్రులకు ఆయన నష్ట పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ నష్ట పరిహారాన్ని అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. మంత్రాలయంలో కొలువుదీరిన శ్రీరాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక వాసులు బొలెరో వాహనంలో వెళ్తున్నారు. ఈ వాహనం ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారు. 13 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలికలు ఉన్నారు. వీరంతా కర్ణాటకలోని చిక్‌మంగళూరు వాసులని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఘటనపై ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# 8 మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరం



- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం
- ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రులు

అమరావతి, నేటిధాత్రి:
మంత్రాలయం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. మంత్రాలయం క్షేత్రం దర్శనం కోసం వస్తున్న కర్ణాటకకు చెందిన భక్తులు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారని అధికారులు వివరించారని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కర్ణాటకలోని ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని బాధిత కుటుంబాలకు తగిన సహాయం చేయాలని కూడా సూచించామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో కర్ణాటకకు చెందిన 8 మంది మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బొలెరో వాహనం రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రాలయం జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ముమ్మందు ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ గుప్తా ప్రకటించారు. కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను ఆయన పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించినట్లు మంత్రి భరత్ గుప్తా తెలిపారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై హోం మంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందడం అత్యంత విచారకరమన్నారు. ట్యాంకర్‌ను బొలెరో వాహనం ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. కర్నూలు రోడ్డు ప్రమాదం బాధాకరమని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. బొలెరో వాహనం - ట్యాంకర్ ఢీ కొన్న ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరమన్నారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం

- లోక్‌సభలో మహిళాబిల్లు, డీలిమిటేషన్ బిల్లులు
- డివిజన్ కోరిన విపక్ష సభ్యులు..స్పీకర్ అంగీకరాం
- సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు గురువారం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టుబట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించ నున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతో పాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ- అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టారు. ఇక, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. వీటిపై లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధాని మోదీ ఈ సాయంత్రం లోక్‌సభలో ప్రసంగిస్తారు. ఇందులో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు. మిగతా రెండూ చట్టపరమైన బిల్లులు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68 మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండియా కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.

# మహిళా బిల్లుతో ఏ రాష్ట్రానికి నష్టం లేదు

- ఈ బిల్లుతో మహిళలకు లోక్‌సభలో 272 సీట్లు
- బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించగా.. కేంద్రమంత్రి మేఘ్‌వాల్ ప్రసంగించారు. ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు. పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. మహిళా రిజర్వేషన్లను అమలుచేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకు పార్లమెంట్‌కు రాజ్యాంగం శక్తినిచ్చింది. ఈ క్రమంలోనే మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. లోక్‌సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం. ఈ బిల్లులతో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్‌సభ స్థానాలు 815కు పెరగడంతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయి. దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదు. ఈ మహిళల కోటాలో ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా కూడా లభిస్తుందని కేంద్ర మంత్రి వివరించారు. అనంతరం ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. మహిళల రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయి. వాటినే కేంద్రం మళ్లీ చెబుతోంది. 2023 కంటే ముందు ఐదుసార్లు మహిళలకు సంబంధించిన చట్టాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మహిళల రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన నాటినుంచే వాటిని అమలుచేయాలి. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ స్థానాల పెంపునకు ముడిపెట్టవద్దు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేస్తామని గతంలో హోం మంత్రి చెప్పారు. మహిళా రిజర్వేషన్లను మరింత ఆలస్యం చేయాలని కేంద్రం చూస్తోందని కాంగ్రెస్ ఎంపీ విమర్శించారు.

# ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

# 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

- కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చున్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుందని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది. మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

# వేసవి రద్దీకి అనుగుణంగా రైళ్లు

## అనంత దుగా యశ్వంతపూర్-జల్పైగురి మధ్య రెండు ట్రైన్స్




అనంతపురం, నేటిధాత్రి:
వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని అనంతపురం మీదుగా యశ్వంతపూర్-జల్పైగురి మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలు నడవనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-న్యూ జల్పైగురి ప్రత్యేక రైలు (నం. 06567) ఈనెల 17, 24 తేదీల్లో (శుక్రవారాల్లో) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి మూడోరోజు సోమవారం ఉదయం 7 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06568) ఈనెల 20, 27 తేదీల్లో (సోమవారాల్లో) న్యూ జల్పైగురి స్టేషన్‌లో ఉదయం 8.30కి బయలుదేరి మూడో రోజైన గురువారం ఉదయం 9.55 గంటలకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హాంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, నంద్యాల, మార్కాపూర్ రోడ్, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కొత్తవలస, విజయనదరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కెయోంజహార్ రోడ్, భద్రక్, ఖరగ్‌పూర్, అందుల్, డాన్కుని, బర్ధమాన్, బోల్పూర్ (శాంతినికేతన్), రాంపూర్ హట్, న్యూ ఫరక్కా, మాల్దా టౌన్, కిష్ణాగంజ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ప్రయాణికుల రద్దీ నియంత్రణకు యశ్వంతపూర్-సహార్స మధ్య వయా గుత్తి మూడు ట్రిప్పుల ప్రత్యక వీక్లీరైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సహార్స- యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నం. 05551)ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకూ గురువారాల్లో రాత్రి 10.25 గంటలకు సహార్సలో బయలుదేరి రెండు రోజుల తర్వాత శనివారం రాత్రి 10.30కి యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 05552) ఈ నెల 19 నుంచి మే 3వ తేదీ వరకూ ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి రెండు రోజుల తర్వాత మంగళవారం ఉదయం 11 గంటలకు సహార్సకు చేరుతుందన్నారు. ఈ రైలు సిమ్రి భక్తియార్పూర్, మన్సి, ఖగారియా, బెగుసరాయ్, న్యూ బరౌని, కియుల్, ఝాఝా, జసిది, మధుపూర్, చిత్తరంజన్, అశన్‌సోల్, దుర్గాపూర్, బర్ధామన్, డంకుని, ఖరగ్‌పూర్, బేలేశ్వర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుద్రా రోడ్, విజయనగరం, విశాఖపట్టణం, దువ్వాడ, విజయవాడ, గుత్తి, ధర్మవరం, హిందూపురం, యల్హాంక స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం



- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు.
ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతు న్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమి టేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

## మహిళా బిల్లు, పునర్విభజనపై మొసలి కన్నీళ్లు



- డిఎంకె తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య
- రేవంత్ హైబ్రీడ్ మోడల్‌పైనా ఆగ్రహం
- కాంగ్రెస్ తీరుపై మండిపడుతూ.
- .ఎపి విభజనపై వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరుగుతున్న చర్చ సందర్భంగా కర్ణాటకకు చెందిన బీజేపీ యువ ఎంపీ తేజస్వి సూర్య విపక్షాలపై, ప్రధానంగా డీఎంకే పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హైబ్రీడ్ మోడల్‌పైనా విమర్శలు గుప్పించారు. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందంటూ డీఎంకే చేస్తున్న వాదనలను ఆయన 'మొసలి కన్నీళ్లు'గా అభివర్ణించారు. 'ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలన్నది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానాల కేటాయింపు జరగడం ప్రజాస్వామ్య సూత్రం' అని తేజస్వి సూర్య పేర్కొన్నారు. డీఎంకే వంటి పార్టీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాది-దక్షిణాది విభజనను సృష్టించాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గుతాయనే ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. 'ప్రధాని మోదీ నాయకత్వంలో ఏ ఒక్క రాష్ట్రానికీ అన్యాయం జరగదు. మొత్తం సీట్ల సంఖ్య పెరగడం వల్ల అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం మెరుగుపడుతుందే తప్ప తగ్గదని ఆయన స్పష్టం చేశారు. కేవలం భయాందోళనలు సృష్టించడం ద్వారా మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలని డీఎంకే ప్రయత్నిస్తోందని విమర్శించారు. గతంలో మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలతో డీఎంకే జట్టు కట్టిందని, ఇప్పుడు మహిళల కోసం మాట్లాడుతుండటం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. 2029 నాటికి మహిళలకు 33 శాతం కోటాను అమలు చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అడ్డుకోవడానికి డీఎంకే కుంటి సాకులు వెతుకుతోందని మండిపడ్డారు. పునర్విభజన అనేది జనాభా గణాంకాల ప్రకారం జరిగే రాజ్యాంగబద్ధమైన పక్రియ అని, దీనిని రాజకీయ కోణంలో చూడటం సరికాదని తేజస్వి సూర్య తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఈ బిల్లుల ద్వారా భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో మహిళలకు సరైన గౌరవం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇకపోతే తెలంగాణ సిఎం హైబ్రిడ్ మోడల్‌ను ఆయన ఫూలిష్ ఆర్యగుమెంట్‌గా అభివర్ణించారు. జివిఎస్‌డిపి అంటూ చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. ఇది రాజ్యాంగం ప్రకారం చెల్లదని అన్నారు. అలాగే తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ను పాకిస్తాన్ తో పోల్చారు. బ్రిటీష్ వారి కంటే చెత్తగా ఏపీని విభజించారని ఆరోపించారు. భారత్ నుంచి పాకిస్తాన్ ను విడదీసినట్లుగా ఏపీని విభజించారని అన్నారు. ఇలాంటి విధానాలతో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి హైబ్రీడ్ మోడల్ అంటూ చేస్తున్న వాదనలను తిప్పి కొట్టారు. జివిఎస్‌డిపి బాగా ఉన్నప్పుడు సీట్లు పెంచితే...తగ్గితే సీట్లు తగ్గించాలా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విధానాలే ఇలా ఉంటాయని అన్నారు.

## పార్లమెంట్ ఆమోదంతోనే తెలంగాణ ఏర్పాటు

### తేజస్విది మిడిమిడి జ్ఞానం అంటూ సింగిరెడ్డి విమర్శలు



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్-భారత్ విభజనతో పోల్చడం దుర్మార్గమని విమర్శించారు. భారత రాజ్యాంగానికి లోబడి, పార్లమెంట్ ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితమని స్పష్టం చేశారు. దశాబ్దాల పోరాటం ఫలితంగా తెలంగాణ సాక్షాత్కరించిందని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. మిడిమిడి జ్ఞానం, అవగాహన లోపంతో బీజేపీ ఎంపీలు తెలంగాణ ఏర్పాటు మీద అవాకులు చెవాకులు పేలుతున్నారని మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ఏర్పాటు పక్రియపై బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు.. తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ విభజన విషయంలో చేసిన వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య, బీజేపీ పార్టీ క్షమాపణ చెప్పాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.
మరోవైపు.. తెలంగాణపై తేజస్వి సూర్య దాడిని బీఆర్ఎస్ కూడా ఖండించింది. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగానికి అవమానం జరిగిందని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. తెలంగాణ ఎంపీలకు పౌరుషం ఉందా అని ప్రశ్నిస్తూ.. రాష్ట్రాన్ని అవమానిస్తుంటే ఢిల్లీలో ఊడిగం చేస్తున్నారా అని మండిపడ్డారు. 'ఢిల్లీలో డప్పు కొట్టే ఎంపీలకు తెలంగాణ ఆత్మగౌరవం పట్టదా? తేజస్వి సూర్య అజ్ఞానసూర్యుడు. బలిదానాల చరిత్ర తెలంగాణ.. అది నీ బుర్రకెక్కితేనే నోరు తెరువు. మొరిగే ఎంపీలని ఆపండి.. లేదంటే తెలంగాణ గడ్డపై బీజేపీకి అడుగుపెట్టే అర్హత లేదు' అని సూర్య ప్రసంగంపై ఘాటుగా స్పందించారు. అటు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా ఎంపీ తేజస్వి వ్యాఖ్యలపై మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా అవమానం జరిగిందని.. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ సూర్య క్షమాపణలు చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు.

## డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

- ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



హైదరాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి సబ్జెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు సబ్జెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదని రామచందర్ రావు అన్నారు.



## తేజిస్వి సూర్య నీకెంత ధైర్యం?

- తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటాన్నికించపరుస్తావా?
- ఇక్కడి ప్రజల ఆకాంక్షలంటే అంత చులకనా?
- తెలంగాణ బీజేపీ ఎంపీలకు పౌరుషముంటే ఈ వ్యాఖ్యలను ఖండించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇండియా, పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే అంత చులకన అయ్యిందా అంటూ మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ పోరాటాన్ని అవమానపరిచేలా మాట్లాడతావంటూ హెచ్చరించారు. తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. 6 దశాబ్దాల పాటు ఎదుర్కొన్న వివక్షకు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలు చేసిన పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడతవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమాన్నే కాకుండా తెలంగాణ సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను కూడా తేజస్వీ అవమానించారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడిన సరే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

### బీజేపీ ఎంపీలు స్పందించాలి


తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా మాట్లాడిన తేజస్వీ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ సమాజానికి జరిగిన అవమానమని అన్నారు. ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తారా అంటూ వారిని ప్రశ్నించారు. వెంటనే ఈ వ్యాఖ్యలను ఖండించి తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రాంత ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే పదవులకు రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సహకారం అందిస్తాం : కేటీఆర్




హైదరాబాద్, నేటిధాత్రి:
వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు .
కేసీఆర్ జన్మదినం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు చెక్‌లు, ట్రోఫీలను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర క్రీడా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.
మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ కప్ స్ఫూర్తితో వచ్చే ఏడాది కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణులను, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను అభినందించారు.
ఓరుగల్లు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి : దాస్యం వినయ్ భాస్కర్
ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 8 ఏండ్లుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పేద క్రీడాకారులకు చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు.

## తెలంగాణ ఏర్పాటు దేశ విభజనతో పోల్చడం దుర్మార్గం : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజన తో పోల్చడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.
మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన ప్రజలు అహింసా మార్గంలో ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం యావత్ ప్రపంచానికి తెలిసిందేనని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని మర్చిపోయి బీజేపీ ఎంపీ దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమన్నారు.
దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడిన ఆయన తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఈ వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన తెలంగాణకు చెందిన బీజేపీ,కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

## మా ఎంపీలు సభలో ఉంటే బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవాళ్లు : హరీష్‌రావు



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు.
ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే గనుక సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవారని హరీష్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు.. ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు.
గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిచేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

# మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన కందుకూరి నరేష్



**పరకాల,నేటిధాత్రి:** పరకాల నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్,ఆంధ్రప్రదేశ్ ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ను మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ పరిస్థితులపై చర్చించారు.కష్టకాలంలో పార్టీని నిలబెట్టిన కార్యకర్తల సేవలను మంత్రి ప్రశంసించారు.పరకాల ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.రాబోయే అసెంబ్లీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ పోటీకి సిద్ధమవుతోందని,గ్రామస్థాయి నుండి కమిటీల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.పరకాలలో టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నరేష్ తెలిపారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన భానుశ్రీకి కలెక్టర్ సన్మానం

▶▶ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్



**శాయంపేట, నేటిధాత్రి:** హనుమకొండ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను ప్రోత్సహించి సన్మానం చేశారు అందులో భాగంగా శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదివిన అంకం భానుశ్రీ 967/1000 మార్కులు సాధించినందుకుగాను శాలువాతో సన్మానిస్తూ జీవి తంలో ఉన్నత స్థాయికి ఎదగాలని తద్వారా తల్లి దండ్రులకు,కళాశాలకు,శాయంపేట గ్రామానికి పేరు తేవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిఐఈవో ఏ.గోపాల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ పాల్గొన్నారు.

# గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడిగా గంధసిరి యాకన్నా ఏకగ్రీవ ఎన్నిక





**కేసముద్రం, నేటిధాత్రి:** అర్పణపల్లి గౌడ సంఘం సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక గ్రామంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ ఎన్నికలో సొసైటీ అధ్యక్షునిగా గంధసిరి యాకన్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. – ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గంధసిరి యాకన్నా మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న గౌడ సంఘం సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సొసైటీ అభివృద్ధికి, కులస్తుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తాను. విద్య, ఉపాధి, ఆరోగ్యంతో పాటు సంఘం సభ్యులకు, గీత కార్మికులకు పింఛన్లు అందేలా కృషి చేస్తాను. అన్ని రంగాల్లో సంఘం సభ్యులకు అండగా నిలుస్తాను" అని హామీ ఇచ్చారు. – నూతన కార్యవర్గానికి కుల సంఘం పెద్దలు, సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం ఐకమత్యంగా ఉండటం వల్లే ఏకగ్రీవ ఎన్నిక సాధ్యమైందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల పెద్ద మనిషి బుచ్చిరాములు, సారుకొల్లా గంధం సంతోష్, మాజీ అధ్యక్షులు గంధం వెంకన్న, ఉపాధ్యక్షులు గంధం శ్రీను, ప్రధాన కార్యదర్శి గంధం వేంకటాద్రి మెంబర్లు రంగయ్య, ఎల్లయ్య, ఐలయ్య, గంగాపురపు యాదగిరి, బుర్ర సుధాకర్, బబ్బురు సతీష్, కందల శ్రీకాంత్, నలమాషా రాములుతో పాటు గౌడ సంఘం పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. –

# ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలి

▶▶ కౌన్సిలర్ బొచ్చు శ్యామల బాబురావు



**పరకాల, నేటిధాత్రి:** పట్టణంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 2వ వార్డు కౌన్సిలర్ బొచ్చు శ్యామల బాబురావు సూచించారు.మధ్యాహ్న సమయంలో అత్యవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలని,తగినంత నీరు తాగుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రత్యేకంగా వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లేవారు,రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించే వారు ఎండల ప్రభావం నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.తలపై గుడ్డలు,టోపీలు ధరించడం,తరచుగా నీరు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వృద్ధులు,చిన్నపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని,ఎండల తీవ్రత తగ్గే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు.

# అరైవ్ అలైవ్ కార్యక్రమం

▶▶ మన ఊరు మన భద్రత మన బాధ్యత.... ▶▶ ఎస్సై పరమేష్...




**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం మాం దారిపేట ప్రధాన రహదారిపై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వ హిస్తున్న అరైవ్ అలైవ్ కార్య క్రమంలో భాగంగా ఎస్సై వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవ గాహన కార్యక్రమం చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివా రణ, డ్రగ్స్ నియం త్రణ సీసీ టీవీ కెమెరాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. జిల్లా,మండల, గ్రామ స్థాయిలో ఉన్న యువ త ఎక్కువగా రోడ్డు ప్రమా దాలకు గురవుతున్నారు కాబట్టి ప్రతి ఒక్క ద్విచక్రవా హనం కలిగి ఉన్న వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాలలో సర్పంచులు అభివృద్ధి పనులు చేయాలి



**భూపాలపల్లి, నేటి ధాత్రి:** మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక సమావేశాన్ని ఎంపీడీవో నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య సిపిఓ జోహార్ లాల్ నాయక్ హాజరైనారు అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమాన్ని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు అందరూ సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి గ్రామాలలో ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి అందరూ లబ్ధి పొందే విధంగా సర్పంచులు చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది అని వారు అన్నారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టుచున్న వివిధ సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకము, గృహజ్యోతి, సన్నరకం బియ్యానికి బోనస్, చేయూత పెన్షన్, కళ్యాణలక్ష్మి/ షాదీముభారక్, ఇందిరా మహిళా శక్తి వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరెలు, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వివిధ నిధుల క్రింద పనుల మంజూరీ తదితర అంశముల పై చర్చించడం జరిగింది గ్రామాలలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని వారు అన్నారు ఈ కార్యక్రమాలు సిపిఓ జోహార్ లాల్ నాయక్ ఎస్ఐ గీత రాథోడ్ వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడి టీచర్స్ తదితరులు పాల్గొన్నారు

# పరకాలలో అగ్నిమాపక అవగాహన కార్యక్రమాలు

▶▶ ప్రమాదసమయంలో పాటించే చర్యలపై ప్రజలకు సూచనలు



**పరకాల,నేటిధాత్రి:** అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఫైర్ సర్వీస్ వీక్‌లో భాగంగా గురువారం పట్టణంలోని సగరవీధి కాలనీలో కరపత్రాల పంపిణీ,గోడలపై పోస్టర్ల ఏర్పాటు ద్వారా గృహాల్లో గ్యాస్ ప్రమాదాలు,షార్ట్ సర్క్యూట్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ భద్రయ్య మాట్లాడుతూ ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచేందుకు పాఠశాలలు, కార్యాలయాలు,వ్యాపార సంస్థలు,గ్రామాల్లో సదస్సులు,మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని,విద్యుత్ భద్రత,ఎల్పీజీ వినియోగం,గ్యాస్ లీకేజీ నివారణ,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎఫ్ కృష్ణ కుమార్,ఎఫ్ఎష్టి గణేష్,ఎఫ్ఎఫ్ లు దిలీప్,రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ లను రాష్ట్రంలో అమలు చేయకూడదు

▶▶ ఏఐఎఫ్ టి యు రాష్ట్ర నాయకుడు... ▶▶ చంద్రగిరి శంకర్ డిమాండ్.....



**భూపాలపల్లి, నేటిధాత్రి:** ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, సింగరేణిలో పెరిగిపోతున్న నేపథ్యంలో సింగరేణి పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి ఏ పాటిదో కార్మిక వర్గం అర్థం చేసుకోవచ్చు, అని ఏఐఎఫ్ టియు రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ చంద్రగిరి శంకర్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు బ్లాక్ ల వేలం పాటలను వ్యతిరేకిస్తూ చిన్న సంఘాల ఆందోళన కార్యక్రమాలు చేస్తుండగా సి ఎం డి పిలుపునందుకొని సింగరేణి భవన్ కు చేరిన ఈ నాయకులు సింగరేణి భవిష్యత్తు, కొత్త గనులు పాత గనుల మూత లాంటి విషయాలతో స్టేటస్ రిపోర్టు చేతిలో పెడితే బసవన్న తలలూపి వచ్చిన ఈ జాతీయ సంఘాల నేతలు, తెలంగాణ డిప్యూటీ సీఎం కి సింగరేణి బొగ్గు గనుల వేలం పాటలకు వ్యతిరేకం కాదు అని ప్రత్యుత్తరాలు నడిపించుకున్న మహానటులు ఏఐటీయూసీ తో పాటు మిగతా కార్మిక సంఘం నాయకులు ఈరోజు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ఎదుర్కోవడానికి బలమైన కార్మిక ఉద్యమం అవసరమై ఉన్నది. చిన్న పెద్ద అనే ఈ గోలకు పోకుండా మిలిటెంట్ కార్మిక వర్గ పోరాటాలను నిర్మించాల్సినటువంటి అవసరం ఉన్నది. ముఖ్యంగా ఎన్ని పాలకవర్గ పార్టీలతో ఓట్లు సీట్లు పంచుకున్న పొత్తులు పెట్టుకున్న దేశవ్యాప్తంగా వస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను విధానాలను మార్పులను ఏఐటియుసి తోపాటు జాతీయ సంఘాలు ఇవి కూడా అడ్డుకోలేకపోయాయి అనేది వాస్తవ సత్యం. రాష్ట్ర ప్రభుత్వం కూడా బేషరతుగా కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల వేలం పాటలను రాష్ట్రంలో రద్దు చేయాలని, సింగరేణి ఎక్స్ప్లోరిషన్ చేసిన బొగ్గు నిక్షేపాలున్న అన్ని బ్లాక్ లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిస్తున్నది. మరి ముఖ్యంగా రిజిస్టర్ కార్మిక సంఘాలను విడదీసి ఐక్య సంఘటన కు ప్రత్యక్షంగా జాతీయ కార్మిక సంఘాలు విభజించి పాలించు అనే చందంగా దోహద పడుతున్నాయి, కాబట్టి ఇప్పటికైనా రిజిస్టర్ కార్మిక సంఘాలు వారు భ్రమలకు లోను కాకుండా ఐక్యంగా కార్మికుల సమస్యల, పరిష్కారం కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైనది. కావున రిజిస్టర్ విప్లవ కార్మిక సంఘాలు ఒక తాటిపై ఉండి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చిన చంద్రగిరి శంకర్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాశీబుగ్గలో ఘనంగా హిందూ ధర్మ సమ్మేళనం ఏర్పాట్లు



**కాశీబుగ్గ, నేటిధాత్రి:** కాశీబుగ్గలో హిందూ ధర్మ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ శనివారం సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీ కాశీ విశ్వేశ్వర రంగనాథ స్వామి ఆలయం ఎదుట "హిందూ ధర్మ సమ్మేళనం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమితి అధ్యక్షులు కాంచనపల్లి కృష్ణాకర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ సమ్మేళనానికి బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామీజీ (శ్రీ జగద్గురు గీతా ఆశ్రమం), తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది కశింశెట్టి కరుణా సాగర్, ఢిల్లీ మెహరౌలి ప్రాంతానికి చెందిన మాతృశక్తి సంయోజిక నీలం నిర్మల హాజరై జాతీయ సమైక్యత, ధార్మిక విలువలు, దేశభక్తి అంశాలపై ప్రసంగాలు చేయనున్నట్లు తెలిపారు. సమితి గౌరవ అధ్యక్షులు గోనె జగదీశ్వర్ మాట్లాడుతూ, సనాతన ధర్మ పరిరక్షణ, సంప్రదాయాల పరిరక్షణ, సామాజిక ఐక్యత పెంపొందించడం లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధాన కార్యదర్శి ములుకుంట్ల విష్ణు మాట్లాడుతూ, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని, వేలాది భక్తులతో కలిసి భారతమాత హారతి నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమితి గౌరవ సలహాదారు సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ, మహిళలకు జోగులాంబ అమ్మవారి ఆలయం నుండి తీసుకువచ్చిన గాజులు, కుంకుమలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే, ఏప్రిల్ 17న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సమితి వెల్లడించింది. ఈ ప్రెస్ మీట్‌లో కోశాధికారి మండల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రాపెల్లి బాలరాజు, కార్యవర్గ సభ్యులు గోగికార్ శ్రావణ్, మార్త సందీప్, గోగికార్ క్రాంతి, మడిపల్లి నాగరాజు గౌడ్ తదితరులు, అలాగే మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై డీజీపీ హెచ్చరిక.



▶▶ హెల్మెట్ తప్పనిసరి.. ప్రాణ రక్షణే లక్ష్యం.

**మహబూబ్ నగర్, నేటిధాత్రి:** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో గురువారం పోలీసులు నిర్వహించిన అరైవ్--అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి హాజరై వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు బటన్ సరిగా పెట్టుకోవాలని సూచించారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ బిగించకపోతే అది ఎగిరిపోవడంతో తలకు తీవ్ర గాయాలు జరిగి ప్రాణనష్టం



కలుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా.. ప్రతి ఏడాది సుమారు 8 వేల మంది వివిధ కారణాలతో..మృతి చెందుతుండగా.. వారిలో దాదాపు 7,500 మంది రోడ్డు ప్రమాదాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని డీజీపీ వెల్లడించారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, గద్వాల రేంజ్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్, ఎస్పీ డి. జానకి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వాహనదారులు పాల్గొన్నారు.

# అక్షయ ఐఐటి ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు.




**కోదాడ, నేటిధాత్రి:** అక్షయ ఐఐటి ఫౌండేషన్ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా కోదాడ పట్టణంలోని నయా నగర్ గల పాఠశాల కరస్పాండెంట్ బోడ్ల లక్ష్మీ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా కోదాడ ఎంఈఓ



సలీమ్ షరీఫ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ షేక్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పాఠశాలలో సంప్రదాయ, ఆధునిక నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకోవడమే కాకుండా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల అకాడమిక్ మార్కుల ఆధారంగా ఐఐటి అకాడమిక్ మార్కులతో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను ఎంఈఓ సలీం షరీఫ్ అభినందించి వారి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేసి ఆయన మాట్లాడుతూ. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థులలో క్రమశిక్షణ నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి తో పాటు అకాడమిక్స్ తో పాటు సహ పాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులలో సర్వతో ముఖాభివృద్ధికి పాఠశాల గురించి చేస్తున్నటువంటి కృషి పట్ల నిర్వాహకులను పాఠశాల యజమాన్యాన్ని ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఆహ్లాదకర వాతావరణంలో అన్ని హంగులతో పిల్లల ఎదుగుదల తన ఎదుగుదలగా భావించి ఎలాంటి ఖర్చులకు వెనకాడకుండా పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడుతున్న పాఠశాల యజమాన్యం, పాఠశాల ఇంచార్జ్ వీరబాబు, ప్రిన్సిపాల్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీరబాబు, ఉపాధ్యాయులు ఫాతిమా, శిరీష, మౌనిక, శ్రీనిధి, నిరోషా, లక్ష్మి, కవిత, కళ్యాణి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లితండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



**నడికూడ,నేటిధాత్రి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ సర్పంచ్ కోంగంటి తిరుపతి అన్నారు. గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అడ్మిషన్లు ప్రారంభించారు.. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ప్రతిభ కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు,ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు,మధ్యాహ్న భోజనం,యూనిఫాం ప్రభుత్వం అందిస్తోందని, అంతేకాకుండా 2026-27 ఈ నూతన విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు,విద్యార్థులకు 21 రకాల చదువుకు కిట్టు అందిస్తుంది అని అన్నారు,పాఠశాలకు కావలసిన అన్ని సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ప్రైవేట్ పాఠశాల మోజులో పడి డబ్బులు వృధా చేసుకోవద్దని కోరారు.స్పోర్ట్స్ కోటాలో వచ్చిన నూతన బీరువను,అలాగే పాఠశాల ఉపాధ్యాయురాలు శశిరేఖ మరి కొన్ని రోజులలో రిటైర్మెంట్ అవుతుండగా పాఠశాలకు బీరువాను స్పాన్సర్ చేయడం జరిగింది. ఈ రెండు బీరువాలను సర్పంచ్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యారాలు ఆర్ ప్రణిత,ఏ.శ్రీనివాస్,బి. శంకర్,వి.శ్రీదేవి,షబానా అజూమ్,ఎన్.ఉదయ్ కుమార్,ఎస్.సురేఖ పిఈటి ప్రేమానందం పాల్గొన్నారు.




# తాతకే షాక్ ఇచ్చిన మనవడు..

## మోహన్‌బాబును ఆటపట్టించిన చిన్నారి అవ్రామ్!




వెండితెరపై క్రమశిక్షణకు, గంభీరమైన వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచే 'కలెక్షన్ కింగ్' మంచు మోహన్‌బాబును ఆటపట్టించాడు అతడి మనవడు అవ్రామ్. మంచు విష్ణు కుమారుడు, మోహన్‌బాబు మనవడు అయిన అవ్రామ్ భక్త మంచు తన తాతయ్యను ఆటపట్టించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

సాధారణంగా మోహన్‌బాబు గొంతు సవరించారంటేనే అందరూ ఎంతో వినయంగా, నిశ్శబ్దంగా ఉంటారు. కానీ, ఈ వీడియోలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అవ్రామ్ అల్లరి చేస్తున్న సమయంలో మోహన్‌బాబు నెమ్మదిగా సైలెంట్‌గా ఉండాలని వారించినా, ఆ చిన్నారి అస్సలు తగ్గలేదు. పైగా తాతయ్యనే అనుకరిస్తూ ఎంతో ముద్దుగా 'ఏంటీ బాబూ..' అంటూ ఎదురు ప్రశ్నించి నవ్వులు పూయించాడు. చివరకు తన అల్లరితో తాతయ్యను మురిపించి, ఎంతో స్టైల్‌గా 'బై బాబూ' అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఎంతటి కఠినమైన క్రమశిక్షణ గల వారైనా మనవడి అల్లరి ముందు మెత్తబడాల్సిందేనని ఈ వీడియో నిరూపిస్తోంది. తన మనవడి మాటలకు మోహన్‌బాబు ముసిముసి నవ్వులు చిందిస్తూ ఉండిపోవడం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ క్యూట్ వీడియో చూసిన అభిమానులు తాతకు తగ్గ మనవడు, డైలాగ్ కింగ్ ముందే డైలాగులు కొడుతున్నాడుగా అంటూ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు.


# రక్తంతో తడిసిన చదరంగం..

## సరికొత్త అవతారంలో సందీప్ కిషన్ 'పవర్ పేట' అనౌన్స్‌మెంట్!

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ చిత్ర పరిశ్రమలో 16 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తన తదుపరి భారీ ప్రాజెక్ట్ 'పవర్ పేట'ను అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి గతంలో పలువురు యంగ్ హీరోల పేర్లు వినిపించినప్పటికీ, చివరికి ఈ పవర్‌ఫుల్ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో సందీప్ కిషన్ కథానాయకుడిగా ఖరారయ్యారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. "ప్రతి కదలికకు ఒక ధర ఉంటుంది" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా ప్రేమ, గౌరవం మరియు రాజకీయాల చుట్టూ తిరిగే కథతో ఉండబోతోంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సాంకేతిక రంగంలో దిగ్గజాలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తుండగా, మధి సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రక్తంతో తడిసిన చదరంగం బోర్డు మరియు విరిగిన పావులను చూపించడం సినిమాలోని ఇంటెన్సిటీని తెలియజేస్తోంది. ఒక సామాన్యుడు రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడిగా ఎదిగే క్రమాన్ని ఈ సినిమాలో ఎంతో లోతుగా చూపించబోతున్నారని సమాచారం. ఈ సినిమా కోసం సందీప్ కిషన్ తన బాడీ లాంగ్వేజ్‌ను పూర్తిగా మార్చుకుని కొత్త లుక్‌లో కనిపించనున్నారు.





# ఎన్టీఆర్ 'డ్రాగన్' రిలీజ్‌పై షాకింగ్ బజ్... మరో ఏడాదిన్నర ఆలస్యమా?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా, దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం డ్రాగన్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన నాటి నుంచే హైప్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండగా, ఇప్పుడు సినిమా రిలీజ్‌పై వస్తున్న వార్తలు అభిమానులను షాక్‌కు గురిచేస్తున్నాయి.దాదాపు మూడు సంవత్సరాల క్రితమే ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించిన మేకర్స్, షూటింగ్‌ను కూడా ఏడాదిన్నర క్రితమే ప్రారంభించారు. అయితే ఇప్పటికీ చిత్రీకరణలో మెజారిటీ పార్ట్ పెండింగ్‌లోనే ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ముందుగా అనుకున్న రిలీజ్ ప్లాన్స్ పూర్తిగా మారిపోతున్నాయని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ప్రారంభంలో ఈ సినిమాను 2026 జూన్‌లో విడుదల చేయాలని భావించినట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుత పరిస్థితులను బట్టి ఆ డేట్‌లో సినిమా విడుదల కావడం అసాధ్యమేనని తెలుస్తోంది. షూటింగ్ పనులు ఇంకా చాలావరకు మిగిలి ఉండటంతో పాటు, ప్రశాంత్ నీల్ సినిమాలకు అవసరమయ్యే భారీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఎక్కువ సమయం తీసుకునే అవకాశముంది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, 'డ్రాగన్' విడుదలకు ఇంకా కనీసం మరో ఏడాదిన్నర సమయం పట్టవచ్చని తెలుస్తోంది. అంటే ఈ చిత్రం వచ్చే ఏడాది డిసెంబర్‌లో విడుదలైనా ఆశ్చర్యం లేదని టాలీవుడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ వార్త నిజమైతే ఎన్టీఆర్ అభిమానులకు ఇది పెద్ద నిరాశగా మారే అవకాశం ఉంది.

ఈ సినిమాపై ఉన్న భారీ అంచనాల దృష్ట్యా మేకర్స్ ఎలాంటి తొందరపడకుండా అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ తన గత చిత్రాలైన కేజీఎఫ్, సలార్ లాగే ఈ సినిమాను కూడా భారీ స్థాయిలో రూపొందిస్తున్నారని సమాచారం. ఇక ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ జోడీపై మంచి ఆసక్తి నెలకొంది. భారీ యాక్షన్ ఎలిమెంట్స్, పాన్ ఇండియా స్థాయి కథనం, ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ ట్రీట్ అన్నీ కలగలిపి ఈ సినిమాను ఇండస్ట్రీలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలబెట్టాయి. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రి మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక రిలీజ్ డేట్ ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.


# సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ.. 'ఏక్ దిన్' ట్రైలర్ అదిరిపోయింది!




స్టార్ బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఏక్ దిన్' (జుని ణఱఅ). అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హీరోయిన్ (సాయి పల్లవి) ఇందులో ఒక అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. అయితే తనను ప్రేమించిన హీరో (జునైద్) అమెతో ఒక్కరోజు అయిన ప్రేమతో గడపాలని కోరుకుంటాడు. అయితే ఆ ఒక్క రోజు వారి జీవితాలను ఎలా మార్చేసింది అనేది కథాంశం. తెలుగులో ఈ చిత్రం ఒక రోజు అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా.. అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నాడు. సాయి పల్లవి హిందీలో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.

# మళ్ళీ చేతులు కలిపిన 'సయ్యారా' టీమ్..

మళ్ళీ చేతులు కలిపిన 'సయ్యారా' టీమ్..



బాలీవుడ్ దర్శకుడు మోహిత్ సూరి, యువ నటీనటులు అహాన్ పాండే, అనీత్ పడ్డాల కాంబినేషన్‌లో వచ్చిన 'సయ్యారా' చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇదే టీమ్ మరోసారి ఒక మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా కోసం చేతులు కలిపారు. 2025లో విడుదలైన 'సయ్యారా' చిత్రం బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.580 కోట్ల వసూళ్లతో ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో, అదే టీమ్ నుండి వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై అక్షయ్ విదాని ఈ సినిమాను నిర్మించబోతున్నాడు.

మోహిత్ సూరి మార్క్ ఇంటెన్సివ్ ఎమోషన్స్ మరియు హృదయాన్ని హత్తుకునే సంగీతంతో సాగే ఈ ప్రేమకథా చిత్ర షూటింగ్ ఈ ఏడాది చివరలో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మోహిత్ సూరి మాట్లాడుతూ, తన సక్సెస్‌ఫుల్ టీమ్‌తో మళ్లీ పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందని, ఈసారి అంతకంటే బలమైన కథతో ప్రేక్షకులను పలకరిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జనరేషన్ జెడ్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ మ్యూజికల్ ఎంటర్టైనర్‌ను 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ సినిమాతో అహాన్ పాండే, అనీత్ పడ్డాల జోడీ మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుందని చిత్ర నిర్మాణ సంస్థ ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఘట్టమనేని వారసుడి గ్రాండ్ ఎంట్రీ..




## ఆకట్టుకుంటున్న 'శ్రీనివాస మంగాపురం' టీజర్

సూపర్ స్టార్ కృష్ణ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఘట్టమనేని కుటుంబం నుంచి మరో మూడో తరం కథానాయకుడు వెండితెరకు పరిచయమవుతున్నారు. కృష్ణ పెద్ద కుమారుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. బుధవారం సాయంత్రం ఈ చిత్ర టీజర్‌ను సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ చిత్రానికి 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. టీజర్ చూస్తుంటే ఇది తిరుపతి నేపథ్యంలో సాగే ఒక ప్యూర్ అండ్ ఇంటెన్స్ లవ్ స్టోరీగా అనిపిస్తోంది. 'మంగ నీది కాదు వాసు బాబు' అనే డైలాగ్‌తో మొదలై, 'మంగ లేకుండా ఈ శ్రీను గాడు తిరుపతి వదిలి వెళ్లే ప్రసక్తే లేదు' అని హీరో చెప్పే డైలాగ్ వరకు టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మొదటి సినిమాతోనే జయకృష్ణ మాస్ అండ్ రస్టిక్ లుక్‌లో ఆకట్టుకున్నారు. తన స్క్రీన్ ప్రెజెన్స్ మరియు డైలాగ్ డెలివరీలో తాత, బాబాయ్‌ల ఛాయలు కనిపిస్తున్నాయని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. టీజర్‌లో ఆమె గ్లామర్ మరియు హీరోతో కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమాలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపిస్తున్నారు. టీజర్ చివరలో ఆయన ఇచ్చిన ఎంట్రీ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. అశ్విని దత్ సమర్పణలో, పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# షూటింగ్‌కు సిద్ధమైన 'ప్రొడక్షన్ నెం. 4'..

## ప్రీ-లుక్ పోస్టర్‌తోనే గూస్‌బంప్స్!

భయానికి సరికొత్త అర్థాన్ని పరిచయం చేస్తూ, వెన్నులో వణుకు పుట్టించే ఒక డార్క్ అండ్ డేంజరస్ హారర్ థ్రిల్లర్ వెండితెరపైకి రాబోతోంది. ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసే హారర్, మిస్టరీ అంశాలతో కూడిన ఈ భారీ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు వీ3 మీడియా మరియు మహా మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మహర్షి కూండ్ల సమర్పణలో, మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాతగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 4'గా షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ముఖ్యంగా 'ఇన్‌స్పైర్డ్ బై ట్రూ ఈవెంట్స్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా, నిజ జీవితంలో జరిగిన కొన్ని భయానక ఘటనల ఆధారంగా తెరకెక్కుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేయడం ద్వారా చిత్ర బృందం క్రేజీ అప్‌డేట్‌ను అందించింది. ఈ పోస్టర్‌లో కనిపిస్తున్న గాఢమైన చీకట్లు, భయంకరమైన చిహ్నాలు మరియు మిస్టీరియస్ ఎలిమెంట్స్ చూస్తుంటే థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ రావడం ఖాయమనిపిస్తోంది. సూర్యాస్ ఈ చిత్రానికి కథను అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో ఆస్కార్ విజేత, ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ భాగం కావడం సినిమా స్థాయిని పెంచడమే కాకుండా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అచ్చు రాజమణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చుతుండగా, మిర్లాన్ నసీర్ సినిమాటోగ్రఫీ మరియు వంశీ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




ఇప్పటికే విడుదలైన ప్రీ-లుక్ పోస్టర్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో, చిత్ర యూనిట్ రేపు అధికారిక టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించి ప్రేక్షకుల్లో మరింత ఉత్కంఠను పెంచింది. వచ్చే నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో, వెండితెరపై ఒక దృశ్య కావ్యంలా ఈ హారర్ థ్రిల్లర్‌ను తీర్చిదిద్దేందుకు చిత్ర బృందం కృషి చేస్తోంది. జీకే మీడియా (గణేష్ -- కుమార్) ఈ చిత్రానికి పిఆర్‌ఓగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీ టైటిల్ ఏమిటి? అసలు ఈ కథ వెనుక ఉన్న ఆ యదార్థ సంఘటనలేంటి? అనే విషయాలు తెలుసుకోవడానికి సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పెద్ది.. స్పెషల్ సాంగ్! పెద్ద కథే.. నడిచిందిగా

త్రిబుల్ ఆర్ సినిమా తరువాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ క్రేజ్ ఖండాంతరాలు దాటిపోయింది. కానీ ఆ తరువాత వచ్చిన రెండు సినిమాలు మెగా ఫ్యాన్స్‌ను మెప్పించలేకపోయాయి. ప్రస్తుతం మెగా అభిమానులు కళ్ళలో ఒత్తులు వేసుకుని మరీ ఎదురుచూస్తున్న సినిమా.. పెద్ది . ఉప్పెన సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గత నెల విడుదల కావాల్సిన ఈ చిత్రం వరుసగా వాయిదాలు పడుతూ వెళ్తుండడంతో మూవీ పై చాలా అనుమానాలు మొదలయ్యాయి. తాజాగా ఈ అనుమానాలకు మూవీ యూనిట్ చెక్ పెట్టారు. నిజానికి పెద్ది సినిమా ఈపాటికే థియేటర్లలో సందడి చేయాల్సింది. తొలుత మార్చి 27న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ షూటింగ్ పనుల్లో జాప్యం జరగడంతో అది ఏప్రిల్ 30కి.. ఆ తర్వాత జూన్ నెలకు వాయిదా పడుతూ వచ్చింది. ఈ ఆలస్యంపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు రావడంతో రీసెంట్‌గా మూవీ యూనిట్ క్లారిటీ ఇచ్చింది. సినిమాకు సంబంధించి టాకీ పార్ట్ అంతా పూర్తయిందని.. కేవలం ఒక్కటంటే ఒక్క పాట మాత్రమే బ్యాలెన్స్ ఉందని వివరించారు.ఈ ఒక్క పాట కోసం చిత్ర యూనిట్ గత నెల రోజులుగా తీవ్రంగా శ్రమిస్తోంది. ప్యాచ్ వర్క్ అలాగే పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుత సమాచారం ప్రకారం.. జూన్ 25న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ అయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక ఈ సినిమాలో అసలు సిసలు హైలైట్ స్పెషల్ సాంగ్. దీని కోసం హీరోయిన్ వెతుకులాట ఒక పట్టాన పూర్తి కాలేదు. మృణాల్ ఠాకూర్ , పూజా హెగ్డే , మానసా వారణాసి , అయేషా ఖాన్ వంటి ముద్దుగుమ్మల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. మధ్యలో మృణాల్‌ను అడిగితే.. తనను ఎవరూ సంప్రదించలేదని చెప్పడంతో ఆశలు అడుగంటాయి.కానీ లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. చిత్ర యూనిట్ మళ్ళీ మృణాల్‌నే కలిసి ఒప్పించిందట. టాలీవుడ్‌లో మృణాల్ అంటే ఇప్పటివరకు మనకు సీతా రామం, హాయ్ నాన్న లాంటి క్లాస్ పాత్రలే గుర్తొస్తాయి. కానీ రీసెంట్‌గా డెకాయిట్ సినిమాతో యాక్షన్‌లోనూ అమ్మడు బాగా అలరించడంతో మృణాల్‌కు ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా బాగా పెరిగింది. దీనికి తోడు పెద్ది సినిమా పక్కా ఊర మాస్ సబ్జెక్ట్ కావడం.. ఇందులో ఆమెతో అదిరిపోయే మాస్ బీట్ చేయిస్తుండటంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. మృణాల్ గ్రేస్, చరణ్ స్పీడ్ తోడైతే థియేటర్లలో సీట్లు చిరగడం ఖాయమని స్పష్టంగా అర్థమవుతోంది.

ఈ సినిమాకు మరో పెద్ద ప్లస్ పాయింట్.. మ్యూజిక్ మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ . ఆయన అందిస్తున్న బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుందని టాక్. ఇప్పటికే విడుదలైన టీజర్స్, పాటలకు సోషల్ మీడియాలో అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. మూవీ యూనిట్ కూడా అవుట్‌పుట్ విషయంలో చాలా కాన్ఫిడెంట్‌గా ఉంది. గ్యాప్ ఇచ్చినా హిట్ పక్కా అన్న రేంజ్‌లో చరణ్ బాక్సాఫీస్ వద్ద వేట మొదలుపెట్టబోతున్నాడు.

# ఈ పండు ఎప్పుడైనా తిన్నారా.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?



సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం

### రోగ నిరోధక శక్తి వృద్ధి

పంపర పనసలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

# వేళకు తింటేనే భళా!



ఆహారంలో పోషకాలు ఉండటం చాలా అవసరం. తేలికపాటి అల్పాహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. మధ్యాహ్న భోజనం పప్పు, కూరలతో నిండుగా ఉండాలి. ఓ మోస్తరుగా రాత్రి డిన్నర్ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ మాకు తెలుసులే అంటారా! మంచిదే!! కానీ, ఈ పోషకాలు ఏ సమయంలోగా తీసుకోవాలో తెలిసినప్పుడే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోండి.

### టైమ్‌కు టిఫిన్

రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

### లంచ్ బెల్

అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా%ా% శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

### డిన్నర్ విన్నర్

రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే%ా% రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

# ఐదు విటమిన్లు తప్పనిసరి!



ఏ ఇంట్లో అయినా ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా బాగుంటుంది. ఉద్యోగం చేసి సంపాదించే మహిళలు అయినా, ఇంటి పట్టున ఉంటూ కుటుంబ యోగక్షేమాలు చూసుకునే గృహిణులకు అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే, ఒక వయసు వచ్చేసరికి అందరిలోనూ అనారోగ్య సమస్యలు తలెత్తడం సహజం. హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి తదితర సమస్యలు వారిని అనారోగ్యానికి చేరువ చేస్తుంటాయి. అయితే, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉండగలం. నడి వయసుకు వచ్చాక మహిళలు అనారోగ్యంతో సావాసం చేయొద్దంటే ఈ ఐదు విటమిన్లు రోజువారీగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

విటమిన్ డి3

దీని లోపం వల్ల ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, ఇన్సులిన్ తగ్గడం, రుతుచక్రంలో మార్పులు, సమస్యలు వస్తాయి. ఉదయాన్నే సూర్యరశ్మి శరీరానికి తాకితే విటమిన్ డి3 పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు, సాల్మన్ చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులకు రెగ్యులర్ డైట్‌లో చోటివ్వడం వల్ల కూడా విటమిన్ డి3 శరీరానికి అందుతుంది.

### విటమిన్ సి

విటమిన్ సి లోపంతో బాధపడేవారికి ప్రొజెస్టిరాన్ ఉత్పత్తి సరిగ్గా ఉండదు. సంతానోత్పత్తి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మకాయ, నారింజ, ఆరెంజ్ వంటి పుల్లటి పండ్ల నుంచి విటమిన్ సి లభిస్తుందని అందరికీ తెలిసిందే. వాటితోపాటు బ్రకోలి, టమాట, క్యాప్సికమ్ నుంచి కూడా శరీరానికి విటమిన్ సి అందుతుంది. జామకాయలు తరచూ తినడం మంచిది. ఇది చర్మ సంరక్షణకూ సహకరిస్తుంది.

### విటమిన్ బి12


ప్రస్తుతం ఎక్కువమంది విటమిన్ బి12 లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది లోపిస్తే.. ఎర్ర రక్త కణాల ఉత్పత్తి మందగిస్తుంది. థైరాయిడ్ సమస్యలు వస్తాయి. మాంసం, చేపలు, గుడ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బి12 లోపం నుంచి బయటపడవచ్చు.

### విటమిన్ బి9

విటమిన్ బి9 లోపంతో గర్భధారణ, సంతానోత్పత్తిలో సమస్యలు ఎదురవుతాయి. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే విటమిన్ బి9 పుష్కలంగా అందుతుంది.

### విటమిన్ బి6

విటమిన్ బి6 లోపం ఉన్న మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, ప్రీ మెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిజార్డర్, అడ్రినల్ గ్రంథి సమస్యలు కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. అరటిపండ్లు, ఆలుగడ్డలు, చికెన్ తినడం వల్ల విటమిన్ బి6 లభిస్తుంది.



# సత్తువ పిండి

మన పెద్దలకు సత్తుపిండి ప్రయోజనాలు బాగా తెలుసు. అందుకే వాళ్లు తరచుగా సత్తుపిండిని ఆహారంగా తీసుకునేవాళ్లు. ఇప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణుల ఆహారంలో సత్తుపిండి ఓ భాగమే. పేదవాళ్ల ప్రొటీన్ల భాండాగారంగా భావించే సత్తుపిండి ప్రయోజనాలను ఇప్పటితరం అంతగా పట్టించుకోవడం లేదు. వీర శివాజీ మెచ్చిన ఈ సహజమైన ప్రొటీన్ పొడి అచ్చంగా భారతీయ ఆహారమే.



### సత్వర శక్తి

సత్తుపిండి శరీరానికి వెంటనే శక్తిని ప్రసాదిస్తుంది. 100 గ్రాముల సత్తుపిండిలో ప్రొటీన్లు 25 నుంచి 30 గ్రాముల వరకు ఉంటాయి. అలా శాకాహారులకు నాణ్యమైన ప్రొటీన్లను ప్రసాదిస్తుంది. అంతేకాదు ఇందులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇది మన కడుపును శుద్ధిచేస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకంతో బాధపడుతున్న వారికి సత్తుపిండి మంచి ఆహారపదార్థం.

### అందరి ఆహారం

సత్తుపిండిలో ట్గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా పెరుగుతాయి. అలా ఇది డయాబెటిస్ ఉన్నవాళ్లకూ మంచిదే. సోడియం తక్కువ ఉండటంతో అధిక రక్తపోటు ఉన్నవారు కూడా ఆరగించవచ్చు. క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఎ, సి విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి. 25 గ్రాముల సత్తుపిండిలో 100 క్యాలరీలు ఉన్నప్పటికీ, దీని ప్రయోజనాలతో పోలిస్తే క్యాలరీల సమస్య పెద్దది కాదు. కండరాలకు శక్తినిస్తుంది కాబట్టి, పెరిగే పిల్లలకూ సత్తుపిండి గొప్పదే.

### ఆహారంలో

బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో సత్తుపిండితో లిట్టి అనే వంటకం చేస్తారు. కూరగాయలు జోడించి పరాఠాలు, ఉప్మా చేసుకోవచ్చు. సత్తుపిండికి ఉల్లిపాయలు కలిపి పకోడీలుగా వేసుకోవచ్చు. సత్తుతో లడ్డూలు, మామిడిపండు రసంతో స్మూతీ, సత్తు కబాబ్‌లు కూడా చేస్తారు. ఇక సత్తుపిండికి కొబ్బరి తురుము, డ్రై ఫ్రూట్స్, శనగపిండి, నెయ్యి, చక్కెర, యాలకుల పొడి లాంటివి చేర్చి చేసే సత్తు పంజిరి రుచిగా ఉంటుంది. నీళ్లు కలిపిన సత్తుపిండి ముద్దకు చక్కెర లేదంటే ఊరగాయ కలుపుకొని ఉపాహారంగానూ ఆరగించవచ్చు. మళ్లీ మధ్యాహ్నం వరకు కడుపులో ఎలుకలు ఉరుకులాడవు.

పానీయంగా

శనగలను ఇసుకలో వేయించి, ఆ తర్వాత వాటిని జల్లెడపడతారు. వీటిని పిండిగా మారుస్తారు. సత్తుపిండి అంటే ఇదే. సత్తుపిండిని బెల్లంతో కలుపుకొని గానీ, ఉప్పు, వేయించిన జీలకర్ర పొడితో కలుపుకొని గానీ తాగితే ఆరోగ్యానికి మంచిది. సత్తు షర్బత్ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా జోడించుకోవచ్చు. ఇది శక్తిదాయిని.

### మితం తప్పొద్దు

మంచిదని చెప్పి సత్తుపిండిని ఎక్కువగా తింటే కడుపులో గ్యాస్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవాళ్లు మితంగా తినాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవాళ్లు సత్తుపిండి తినకూడదు. కిడ్నీల్లో రాళ్లు ఉంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ఇక శనగలంటే అలర్జీ ఉన్నవాళ్లు, సత్తుపిండి అరిగించుకోలేని వాళ్లు కూడా సత్తుకు దూరంగా ఉంటే మంచిది.

# గోధుమ పిండికి ఇవి కలిపితే టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.

మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి వాముజి,అవిసె గింజలు

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా



హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.

ఓ పాఠకురాలు

కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.

అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

